విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సులు అందజేత

విశాలాంధ్ర - భీమిలి: తాటితూరు జడ్పీహెచ్ హైస్కూల్లో 10వ తరగతి చదువుతున్న 11 మంది విద్యార్థులకు చదువుతోపాటు క్రీడారంగంలో కూడా మండల స్థాయిలో, జిల్లా స్థాయిలో, రాష్ట్రస్థాయిలో విద్యార్థులు గేమ్స్ పోటీలో పాల్గొని తల్లిదండ్రులకు విద్య నేర్పిన గురువులకు తాటితూరు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని గ్రామ సర్పంచ్ శిరిడి ఈశ్వర సంతోషి అన్నారు. 11 మంది విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సులను స్కూల్ ప్రధానోపాధ్యాయులు డి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, ఎస్ఎంసి కమిటీ చైర్మన్ కమిటీ సభ్యులు సమక్షంలో అందజేశారు.

కొత్త రోడ్డు మాట దేవుడెరుగు.... ఉన్న రోడ్డుకి మరమ్మతులు చేపట్టండి....

- అధ్వాన్నంగా తాళ్ళవలస - కుమ్మరిపాలెం రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న ప్రజానీకం

విశాలాంధ్ర - భీమిలి: కుమ్మరిపాలెం నుండి తాళ్ళవలస హైవేకి వాళ్ళే రోడ్డు కొన్ని సంవత్సరాలుగా గుంతలతో దారుణంగా ఉంది. ఈ రోడ్డులో ప్రైవేటు జూనియర్ కళాశాలల బస్సులు రోజూ వందల సంఖ్యలో వెళ్తుంటాయి. ఈ గుంతల కారణంగా విద్యార్థులకు వెన్నుపూస సమస్యలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కుమ్మరిపాలెం భీమిలి నుంచి కుమ్మరిపాలెం ఈ మార్గంలో ప్రయాణించాలంటే ప్రజలకు నరకం కనబడుతోంది. పది పదిహేనేళ్ళ నుంచి కూడా ఈ రోడ్డు పరిస్థితి ఇదే. ఇంత అధ్వాన్నంగా రోడ్డు ఉన్నప్పటికీ దీనికి కనీసం మరమ్మతులు కూడా చేసిన పాపాన పోలేదు. ఈ రోడ్డు మీద రోజు రోజుకీ గోతులు మరింతగా పెరిగిపోతున్నాయి. చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలను ద్విచక్ర వాహనాలపై స్కూల్, కాలేజీలకు ఈ మార్గాన్నే ఉపయోగిస్తారు. వారందరికీ ఈ గోతుల రోడ్డు కష్టాలు తప్పడం లేదు. పదేళ్లుగా కనీసం ఈ రోడ్డు మరమ్మతులు కూడా చేయకపోవడం విచిత్రం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రోడ్ల మీద ప్రత్యేక దృష్టి పెడుతున్నామని, రోడ్లన్నీ బాగు చేస్తామని చెప్పినప్పటికీ, ఈ రోడ్డు మాత్రం బాగుపడలేదు. వీఎమ్మార్డీఏ మాస్టర్ ప్లాన్‌లో ఎప్పుడో ఈ రోడ్డును వంద అడుగులు రోడ్డుగా మార్క్ చేశారు గానీ రోడ్డు వేసే ఆలోచన మాత్రం ఇప్పటికీ చేయలేదు. రోడ్డు మరమ్మతులు చేయక పోవడం కారణంగా రోజూ ఈ దారిలో తిరిగే ప్రజల వాహనాలు, శరీరాలు మాత్రం మరమ్మతులకు గురవుతున్నాయి.

కొత్త రోడ్డు వేయడం మాట దేవుడెరుగు, కనీసం ఆ గోతులు కప్పడం చేస్తే కొంతవరకూ ప్రజలకు ఇబ్బంది ఉండదు. ఈ రోడ్డులో అపార్ట్మెంట్లు, కాలేజీలు, స్కూళ్ళు పెరగడంతో ట్రాఫిక్ కూడా పెరుగుతోంది. రాత్రిపూట అయితే కనీసం ఒక స్ట్రీట్ లైట్ కూడా ఈ దారిలో ఎక్కడా కనపడదు. పొరపాటున ఏదైనా గోతిలో వాహనం పడి ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది? వర్షం పడిన ప్రతిసారీ నీళ్ళతో నిండడం వలన గోతులు ఎక్కడ ఉన్నాయో కూడా కనపడవు. ఇప్పటికైనా నాయకులు, అధికారులు కాస్త చొరవ తీసుకుని, ఈ రోడ్డును బాగు చేయాలని స్థానికులు కోరుచున్నారు.

16 నుంచి జీఎస్టీ సేవింగ్ షాపింగ్ ఫెస్టివల్

- ఏయూ ఇంజనీరింగ్ మైదానంలో 60 స్టాళ్లు
- కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జీఎస్టీ 2.0 సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ది గ్రేట్ వైజాగ్ షాపింగ్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, ఆహార తయారీ తదితర చిన్న, పెద్ద తరహా వ్యాపార సంస్థల సౌజన్యంతో సుమారు 60 స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నామని, షాపింగ్ ఫెస్టివల్‌లో భాగంగా జీఎస్టీపై అవగాహన శిబిరం ఉంటుందని, అలాగే ప్రజలను అలరించేలా సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఉంటాయని పేర్కొన్నారు. జీఎస్టీ 2.0 సంస్కరణల్లో భాగంగా ప్రజలకు చేకూరుతున్న ఆర్థిక ప్రయోజ నాలపై అవగాహన కల్పించే నిమిత్తం ఈ నెల 16వ తేదీ నుంచి ఏయూలో నిర్వహించబోయే షాపింగ్ ఫెస్టివల్ నిర్వహణ, ఇతర అంశాల గురించి జీఎస్టీ, టూరిజం అధికారులతో కలసి ఆయన మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ వీసీ హాలులో జిల్లా కలెక్టర్ విలేకరులతో మాట్లాడారు. సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ పేరుతో సెప్టెంబర్ 22వ తేదీ నుంచి దీపావళి వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించేందుకు షెడ్యూల్ రూపొందించామని, దానిలో భాగంగా ఈ షాపింగ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నామన్నారు. వినియోగదారులను ఉత్సాహ పరిచేలా సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రోత్సహించేలా లక్కీ డ్రా ఉంటుందని వివరించారు. విశాఖ ప్రజలంతా సహకరించి షాపింగ్ ఫెస్టివల్‌ను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. స్టేట్ జీఎస్టీ అదనపు కమిషనర్ ఎస్.శేఖర్, అసిస్టెంట్ కమిషనర్ రాంబాబు, టూరిజం అధికారిణి జె.మాధవి, హోటల్స్ అండ్ టూరిజం అసోసియేషన్ ప్రతినిధి పవన్ కార్తీక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మార్కెట్లను అభివృద్ధిలోకి తేవాలి: ఎమ్మెల్యే గంటా

విశాలాంధ్ర - ఆనందపురం: మార్కెట్లలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని మార్కెట్లు అభివృద్ధి చెందినట్లయితే ఆర్థిక వ్యవస్థ బాగుపడుతుందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ మార్కెట్ పునవ్యవస్థీకరణ చర్యలు చేపట్టాలని తెలిపారు. భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కురిమిన రామస్వామి నాయుడు మాట్లాడుతూ రైతు పండించే పంటను నిర్ణీత కాలంలో క్రయ విక్రయాలు జరపాలంటే మార్కెట్‌లు ఆధారమని అటువంటి మార్కెట్లను అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని అన్నారు. నియోజకవర్గంలో మార్కెట్లను పరిశీలించడం జరిగిందని, అందులో కొన్ని మార్కెట్లను వినియోగంలోకి తెచ్చిన ట్లయితే రైతులకు అందుబాటులో ఉంటాయని అలాగే భీమిలి వ్యవసాయ మార్కెట్ యార్డ్ స్థలంలో కొత్తగా మొక్కలను నాటి రైతు బజారు ఏర్పాటు చేస్తామని, అలాగే మార్కెట్కు ఆనుకొని ఉన్న స్థలంలో కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మిస్తామన్నారు. సమావేశంలో వ్యవసాయం మార్కెట్ కమిటీ కార్యదర్శి లక్ష్మి చైతన్య, వైస్ చైర్మన్ జగన్నాథం, వేములవలస పిఎసిఎస్ చైర్మన్ రౌతు నాగరాజు, డైరెక్టర్లు రామలక్ష్మి, నాయుడు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

వైసీపీ కోటి సంతకాలు సేకరణ

విశాలాంధ్ర - విశాఖ సిటీ: విశాఖ ఉత్తర నియోజకవర్గం 44వ వార్డు అక్కయ్యపాలెం నుండి పోర్టు హాస్పిటల్ వరకు హైవే పక్కన గ్రీన్ బెల్ట్ పార్కు వద్ద మంగళ వారం ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు, విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె రాజు పాల్గొని విద్యార్థులు, మేధావులు తదితరులతో సంతకాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్,కార్పొరేటర్లు కె.అనిల్ కుమార్ రాజు, బర్కత్ అలీ, కో-ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, వాలంటరీ విభాగం జోనల్ ప్రెసిడెంట్ యం.సునీల్ కుమార్, జిల్లా అనుబంధ విభాగం అధ్యక్షులు పేడాడ రమణికుమారి, నీలి రవి, శ్రీదేవి వర్మ, వార్డు అధ్యక్షులు గుజ్జు వెంకటరెడ్డి, బీశెట్టి ప్రసాద్, హబీబ్, బలిరెడ్డి గోవింద్, కె.సుకుమార్, ఐ.రవికుమార్, రాష్ట్ర అనుబంధ విభాగం నాయకులు బాణాల తరుణ్, మాజీ కార్పొరేటర్ పామోటి బాబ్జి, నియోజకవర్గ అనుబంధ సంఘాల అధ్యక్షులు షేక్ బాబ్జి, బాధ శ్రీను, జిల్లా కమిటీ నాయకులు సాడి కేశవ్, బోగవల్లి గోవింద్, జక్కపూడి సత్యనారాయణ, చిరంజీవి, ఎర్రంశెట్టి శ్రీను, పద్మా శేఖర్, గంగా మహేష్, పారువల్లి రవి, కె.చిన్న, మహేష్ బాబు, మహాదాస్య గోపి, మౌనిక, కడితి రమేష్, అనిల్, బసీర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓర్వలేకనే వైసీపీ దుష్ప్రచారం

- జిల్లా టీడీపీ అధ్యక్షులు గండి బాబ్జి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే వైసీపీ దుష్ప్రచారం చేస్తుందని రాష్ట్ర కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్, జిల్లా టీడీపీ అధ్యక్షులు గండి బాబ్జి అన్నారు. మంగళవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత విశాఖకు ఐటీ దిగ్గజ సంస్థలు వస్తున్నాయన్నారు. సీఫి డేటా సెంటర్‌కు మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేశారని, తద్వారా విశాఖ ఆర్థిక వ్యవస్థ ఒక ట్రిలియన్ డాలర్లకు చేరుతుందని చెప్పారు. డేటా సెంటర్లకు విశాఖలో అనుకూల వాతావరణం ఉందన్నారు. చంద్రబాబుకు చెడ్డ పేరు తేవాలనే ఉద్దేశ్యంతో కల్తీ మద్యాన్ని తయారు చేస్తున్నారని ప్రచారం చేస్తున్నారన్నారు. మూడు రాజధానులు పేరుతో డ్రామా ఆడిన జగన్ విశాఖలో రుషికొండ భవనాలు తప్ప వేరే భవనం నిర్మించలేదని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన పదిహేను నెలలు నుంచి ప్రతి నెల ఒకటవ తేదీకి జీతాలు, పెన్షన్, సంక్షేమ పథకాలు ఇస్తున్నామని చెప్పారు.

వర్తక సంఘం అధ్యక్షులు దాడి మృతి

విశాలాంధ్ర-సింహాచలం: గ్రేటర్ విశాఖ గోపాలపట్నం వర్తక సంఘం అధ్యక్షులు దాడి అప్పారావు (76) మంగళవారం మధ్యాహ్నం కన్నుమూశారు. గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో ఉన్న ఆయన హెల్త్ సిటీ ఆరిలోవ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. దీర్ఘకాలంగా గోపాలపట్నం వర్తక సంఘం అధ్యక్షునిగా పనిచేస్తున్న అప్పారావు, కొత్తపాలెం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షునిగా 25 సంవత్సరాల పాటు పని చేశారు. మాజీ ఎమ్మెల్యే అల్లు భానుమతి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్‌గా ఉన్న సమయంలో, ఆ బ్యాంకు పాలకవర్గ డైరెక్టర్‌గా కూడా అప్పారావు పని చేశారు. టీడీపీలో గోపాలపట్నం ప్రాంతంలో క్రియాశీలంగా వ్యవహరించిన అప్పారావు అంత్యక్రియలు బుధవారం గోపాలపట్నంలో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

వీఎంఆర్డీఏ ప్రాజెక్టులపై చర్చించిన ఇన్చార్జి కమిషనర్, చైర్మన్

విశాలాంధ్ర - విశాఖ: వీఎంఆర్డీఏ ఇన్చార్జి కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ని చైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వీఎంఆర్డీఏ ప్రాజెక్టులపై వారు చర్చించారు.

అంబుజా సిమెంట్ గ్రైండింగ్ యూనిట్‌ను వ్యతిరేకించండి

సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కసిరెడ్డి

విశాలాంధ్ర - పెదగంట్యాడ: పోరాటాలతోనే అంబుజా సిమెంట్ గ్రైండింగ్ యూనిట్ ఏర్పాటును అడ్డుకుంటామని సీపీఐ స్పష్టం చేసింది. పెదగంట్యాడ శివారులో 23.3 ఎకరాల విస్తీర్ణంలో ఏడాదికి 4 మిలియన్ టన్నుల సామర్థ్యంతో ఏర్పాటయ్యే అదానీ అంబుజా సిమెంట్ గ్రైండింగ్ యూనిట్ ఏర్పాటు చేయడానికి గంగవరం పోర్టు యాజమాన్యం నిర్ణయం తీసుకోవడం పట్ల సీపీఐ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. అంబుజా సిమెంట్ గ్రైండింగ్ యూనిట్ ఏర్పాటును నిరసిస్తూ సీపీఐ గాజువాక నియోజక వర్గ సమితి మంగళవారం పెదగంట్యాడ ప్రధాన రహదారితోపాటు ఇంటింటికీ కరపత్రాలు పంచుతూ ప్రచారాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ అదానీ అంబుజా సిమెంట్ గ్రైండింగ్ యూనిట్ ఈ ప్రాంతంలో ఏర్పాటు చేస్తే పెద గం ట్యాడ, గాజువాక, గంగవరం అంతా కాలుష్య మయంగా మారుతుందని అన్నారు. ఇప్పటికే గంగ వరం పోర్టు వల్ల ఈ ప్రాంతం కాలుష్యంగా మారిందని, గంగవరం పోర్టు కాలుష్యం వల్ల ఈ ప్రాంత ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురయ్యారని అన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు కె.వనజాక్షి, సీనియర్ నాయకులు టి.సాంబ మూర్తి, కె.పోతయ్య, పిల్లా పద్మ, శివ, ఈశ్వర్‌రావు, కృష్ణ, భాస్కరరావు, తిరుపతిరావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో మోహిత్ శివ సాయి ప్రతిభ

విశాలాంధ్ర - మల్కాపురం: రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పల్లా మోహిత్ శివ సాయి యాదవ్ 30, 32 కేజీల విభాగాల్లో స్వర్ణ పతకం సాధించాడు. అక్టోబర్ 12, 13, 14 తేదీల్లో రాజమండ్రిలో బాలుర విభాగంలో జరిగిన పోటీల్లో స్వర్ణ పతకం సాధించి పలువురి మన్ననలను పొందాడు. మల్కాపురం ప్రాంతానికి చెందిన మోహిత్ శివ సాయిని సీనియర్ బాక్సర్లు అభినందించారు. మరిన్ని పతకాలు సాధించాలని ఆశీర్వదించారు. దీనిపై తల్లిదండ్రులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

పీడీఎస్ఓ విశాఖ జిల్లా మహాసభను విజయవంతం చేయండి

విశాలాంధ్ర - పెందుర్తి: విశాఖ పౌర గ్రంథాలయంలో అక్టోబరు 15న జరిగే పీడీఎస్ఓ విశాఖ జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ షఫీ ఉల్లా, పీడీఎస్ఓ జిల్లా అధ్యక్షులు పి.విశ్వనాథ్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు పెందుర్తి బిసీ హాస్టల్‌లో మహాసభ పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ పెందుర్తి బీసీ హాస్టల్‌లో విద్యార్థులకు సరిపడా గదులు లేవని, అదనపు గదులు నిర్మించాల్సిన అవసరం ఉందని అన్నారు. అలాగే పెందుర్తిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మించాలని, విద్యార్థుల సంఖ్యకు సరిపడా ప్రభుత్వ వసతి గృహాలను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ఓ సభ్యులు వసంత్, హర్ష తదితరులు పాల్గొన్నారు.

ఆర్కే బీచ్‌లో యువతిని కాపాడిన పోలీసులు

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్: విశాఖపట్నంలోని కంచరపాలెంకు చెందిన ఒక యువతి ఇంట్లో గొడవల కారణంగా ఆత్మహత్య చేసుకోవడానికి ఆర్కే బీచ్‌కు వెళ్లింది. కుటుంబ సభ్యులు 112కు ఫిర్యాదు చేయగా.. మహారాణిపేట పోలీసులు అప్రమత్తమయ్యారు. బీచ్ రోడ్డులో సాగర్ తీరం వద్ద యువతిని గుర్తించి, ఆమెను కాపాడి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులను పలువురు ప్రశంసించారు.

గాంధీమార్గం నేటికీ అనుసరణీయం

గీతంలో జె.ఎన్.యూ. విశ్రాంత ప్రొఫెసర్ మృదుల ముఖర్జీ

విశాలాంధ్ర - మధురవాడ: మహాత్మా గాంధీ ఆలోచనలు నేటి ప్రపంచంలోనూ ఎంతో ప్రాముఖ్యతను కలిగి ఉన్నాయని, ముఖ్యంగా ఆయన జీవిత ప్రయాణం, సంభాషణా శైలిని లోతుగా అర్థం చేసుకునే వారికి గాంధీమార్గం ఆచరణీయ మని ప్రముఖ చరిత్రకారిణి, జవహర్లాల్ నెహ్రూ విశ్వ విద్యాలయం (జేఎన్‌యూ), న్యూఢిల్లీకి చెందిన చరిత్ర అధ్యయన కేంద్రం మాజీ ప్రొఫెసర్ మృదుల ముఖర్జీ చెప్పారు. ఆమె మంగళవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్‌లో "గాంధీ కలల స్వరాజ్ ఆధునిక భారతంపై పరి చింతనలు" అనే అంశంపై ఆసక్తికరమైన ఉపన్యాసం ఇచ్చారు. గాంధీ ప్రజలతో సరళంగా, వారిని ఆకర్షించేలా మాట్లాడటానికి సంప్రదాయ పదాలను ఎంత బాగా వాడారో వివరించారు. గాంధీ అన్ని మతాలూ సమానమే అని నమ్మారని, ఆయన రామరాజ్యం భావన మతపరమైనది కాకుండా, సమగ్రతను సూచించేదని ఆమె తెలిపారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ డైరెక్టర్ డాక్టర్ సుష్మారాజ్ ముఖ్యఅతిథి మృదుల ముఖర్జీని సన్మానించారు.

కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థినిలకు మెరుగైన వైద్య సేవలు

రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: కురుపాం బాలికల పాఠశాలలో అస్వస్థతకు గురై కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న 65 మంది విద్యార్థినిలలో పూర్తి ఆరోగ్యం చేకూరిన 59 మంది విద్యార్థినిలను కేజీహెచ్ నుండి డిశ్చార్జ్ చేసినట్లు రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. మంగళవారం ఉదయం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థినిలను మంత్రి పరామర్శించి వారికి అందుతున్న వైద్య సేవలను గురించి కేజీహెచ్ సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ కురుపాం గిరిజన బాలికల పాఠశాలలో 146 మంది విద్యార్థినిలు అస్వస్థతకు గురయ్యారన్నారు. అస్వస్థతకు గురైన వారిలో 65 మంది బాలికలను మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌లో చేర్పించామని అన్నారు. బాలికలు జాండీస్, జ్వరంతో బాధ పడుతున్న వారికి మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌లో చేర్పించడం జరిగిందన్నారు. కేజీహెచ్‌లో మెరుగైన వైద్యం అందించడం ద్వారా 59 విద్యార్థినిలు పూర్తిగా కోలుకొని వారి ఇళ్ళకు వెళ్లడం జరిగిందన్నారు. మరో 6 గురిలో ముగ్గురిని నేటి సాయంత్రం డిశ్చార్జ్ చేయనున్నట్లు వైద్యులు తెలిపారన్నారు. మరో ముగ్గురిని పూర్తిగా కోలుకున్న తర్వాత డిస్చార్జ్ చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఉన్న హాస్టల్స్, ఏకలవ్య స్కూల్స్, గురుకుల పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూల్స్ లో మౌలిక సదుపాయాలు, చిన్నచిన్న రిపేర్లు తదితర పనుల నిమిత్తం రూ. 90 కోట్లు ముఖ్యమంత్రి మంజూరు చేసినట్లుగా మంత్రి వివరించారు.

లయన్స్ ఆసుపత్రికి ఫైర్ ఎన్ఓసీ

విశాలాంధ్ర - విశాఖపట్నం: విశాఖపట్నంలోని లయన్స్ క్యాన్సర్, జనరల్ హాస్పిటల్ మేనేజింగ్ ట్రస్టీ లయన్ ప్రొఫెసర్ వి.ఉమా మహేశ్వరరావు ఇన్‌ఛార్జ్ రీజినల్ ఫైర్ ఆఫీసర్ సిహెచ్ కృపావరం చేతుల మీదుగా మరో రెండు సంవత్సరాల పాటు వినియోగంలో ఉండే, ఫైర్ నో అబ్జెక్షన్ రెన్యూవల్ సర్టిఫికేట్‌ను అందుకున్నారు. ఎటువంటి ఉల్లంఘనలకు పాల్పడకుండా అగ్నిమాపక భద్రతా నియమాలను, నిబంధనలను ఖచ్చితంగా పాటించినందుకు ఆసుపత్రి నిర్వాహకులను కృపావరం ఈ సందర్భంగా అభినందించారు. విశాఖపట్నంలోని లయన్స్ క్యాన్సర్ జనరల్ హాస్పిటల్‌కు ఫైర్ నో అబ్జెక్షన్ రెన్యూవల్ సర్టిఫికేట్ జారీ చేయడంలో సహకరించినందుకు రీజినల్ ఫైర్ ఆఫీసర్ (ఇన్‌చార్జ్) సిహెచ్ కృపావరం, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఎస్.దిలీప్‌కి ఆసుపత్రి మేనేజింగ్ ట్రస్టీ ఉమా మహేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

తిరుపతిలో మృతులకు రూ.25 లక్షలు.. తురకపాలెంకు రూ.5 లక్షలా...?

- రూ.25 లక్షలు చెల్లించాల్సిందే..
- విదసం డిమాండ్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: గత 5 నెలల కాలంలో గుంటూరు తురకపాలెంలో కల్తీ తాగు నీటితో జరిగిన మిస్టరీ వ్యాధి మృతుల కుటుంబాలకు నష్ట పరిహారం చెల్లింపులో ప్రభుత్వం వివక్ష చూపిస్తుందని, తిరుపతి తొక్కిసలాట మృతులకు 25 లక్షలు చెల్లించి తురకపాలెం మృతులకు కేవలం 5 లక్షలే చెల్లించడం ధర్మం కాదని తక్షణమే నష్ట పరిహారం 25 లక్షలకు పెంచాల్సిందేనని విదసం (విస్తృత దళిత సంఘాల) ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకట రావు డిమాండు చేశారు. తురక పాలెం మిస్టరీ మృతుల కుటుంబాలకు ప్రభుత్వం చెల్లించిన నష్ట పరిహారంపై తీవ్ర ఆక్షేపాన్ని, అభ్యంతరాన్ని వ్యక్తం చేస్తూ మంగళవారం విశాఖ అంబేద్కర్ భవన్‌లో విదసం ఐక్య వేదిక సమావేశంలో ఆయన మాట్లాడారు. తురకపాలెం మృతులకు పత్తిపాడు ఎమ్మెల్యే బి.ఆంజ నేయులు, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చేతులు మీదుగా 5 లక్షల చెక్కులు పంపిణీ చేశారని, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల జరిగిన మరణాలకు కేవలం 5 లక్షలు మాత్రమే చెల్లించి బాధ్యత నుండి తప్పించుకోవాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. గత నెల 14న విదసం ప్రతినిధులు తురకపాలెం సందర్శించి బాధితులను కలెక్టరు వద్దకు తీసుకెళ్లి నష్ట పరిహారంపై ప్రభుత్వ బాధ్యతను మేము గుర్తు చేశామన్నారు. ఇదే విషయాన్ని జాతీయ ఎస్సీ కమిషన్ మెంబర్ రామ చంద్ర, డైరెక్టర్ సునీల్ కుమార్‌లకు చేసిన ఫిర్యాదుపై కమిషన్ వారు కలెక్టరును వివరాలు కోరడంతో ప్రభుత్వం కంగారు పడి మొక్కుబడిగా నిన్న 5 లక్షలు రూపాయలు చెల్లించి చేతులు దులుపేసుకుందని విమర్శించారు. ఇటీవల తిరుపతి తొక్కిసలాట మృతుల కుటుంబాలకు 25 లక్షలు, అన్నమయ్య జిల్లాలో ఏనుగుల దాడి మృతులకు 10 లక్షలు చెల్లించిన ప్రభుత్వం తురక పాలెం దళితులకు 5 లక్షలే చెల్లించడం వివక్ష కాదా అని ప్రశ్నించారు. తురక పాలెం మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఉద్యోగం, గృహ వసతి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. చెక్కులు పంపిణీ సందర్భంగా ఎమ్మెల్యే ఆంజనేయులు దళిత సంఘాలను అవమానిస్తూ చేసిన వ్యాఖ్యలపై జాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జాజి ఓంకార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బూల భాస్కరరావు, గుడివాడ ప్రసాద్, యుఎస్ రాజు, సిహెచ్ దాలయ్య, కస్తూరి వెంకటరావు, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయొద్దు

విశాలాంధ్ర - పద్మనాభం: గత ప్రభుత్వం 17 మెడికల్ కాలేజీలను రాష్ట్రానికి తీసుకువస్తే ప్రస్తుత ప్రభుత్వం వాటిని ప్రైవేటువరం చేయడానికి అన్ని ఏర్పాట్లు చేస్తుందని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త శ్రీనివాసరావు అన్నారు. మండల వైసీపీ పార్టీ కార్యాలయంలో మండల వైసీపీ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల భవిష్యత్తును ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టి వ్యాపారం చేస్తుందని అన్నారు. దీనికి వ్యతిరేకంగా రాష్ట్ర వైసీపీ పార్టీ ఆదేశాల మేరకు కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దీనిలో భాగంగా భీమిలి నియోజకవర్గంలో పద్మనాభం మండలానికి 10000 సంతకాలు సేకరణ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ కే.రాంబాబు, జడ్పీ వైస్ చైర్మన్ ఎస్.గిరిబాబు, మండలంలోని వైసీపీ అభిమానులు కార్యకర్తలు నాయకులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మృత్యువులోనూ....వీడని బంధం...

కంచరపాలెంలో భార్యాభర్తలు మృతి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: గంట వ్యవధిలో భార్యాభర్తల మృతి ఆ ప్రాంతాన్ని తీవ్రంగా కలచివేసింది. బంధువులు ఒక్కసారిగా ఆర్తనాథాలకు గురయ్యారు. శ్రీనివాస్ నగర్, కంచరపాలెం ప్రాంతానికి చెందిన కళ్ళెంపూడి దుర్గమ్మ (58) వృద్ధురాలు మరణించిన గంట వ్యవధిలోనే ఆమె భర్త కళ్ళెంపూడి తాతారావు (60) వృద్ధుడు భార్య మృతిని జీర్ణించుకోలేక గుండె ఆగిపోయిందని స్థానికులు తెలిపారు. ఇద్దరి మృతిని జీర్ణించుకోలేక బంధువులు వారి పిల్లలు తీవ్ర ఆర్తనాథాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

విశాలాంధ్ర
పేజి 2
విశాఖపట్నం
బుధవారం 15, అక్టోబర్ 2025

రంగనాథ స్వామి దేవస్థానం విద్యుత్ సౌకర్యంకై వినతి

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం గుడిలోవ గ్రామంలో ఉన్న పురాతన దేవాలయం పంచపాండవుల సందర్శించిన శ్రీ రంగనాథ స్వామి దేవస్థానంకు విద్యుత్ సౌకర్యం పూర్తిస్థాయిలో లేదని సాధారణ రోజులలో భక్తులు రావడం జరుగుతుందని రానున్న కార్తీకమాసంలో పెద్ద ఎత్తున భక్తుల సందర్శన ఉంటుందని భక్తులు ఇబ్బందులకు గురవుతున్నారని పూర్తి స్థాయిలో విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యే గంటాకు పాలవలస గ్రామస్తులతోపాటు టీడీపీ నాయకుడు తర్లువాడ సర్పంచ్ బిఆర్‌బి నాయుడు సమక్షంలో శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. సమస్యపై సానుకూలంగా స్పందించిన శాసనసభ్యులు సమస్యపరిష్కారం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గూగుల్ డేటా సెంటర్‌తో మారనున్న విశాఖ రూపురేఖలు

కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: మైక్రోసాఫ్ట్ రాకతో హైదరాబాద్ ఎంత వేగంగా అభివృద్ధి చెందిందో... అదేమాదిరిగా గూగుల్ డేటా సెంటర్ రాకతో విశాఖపట్టణంలో కూడా పెనుమార్పులు చోటు చేసుకుంటాయని, నగరం రూపురేఖలు మారిపోతాయని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం ఢిల్లీలో గూగుల్ సంస్థతో జరిగిన ఒప్పందం, ఇతర కంపెనీల రాక, విశాఖపట్టణం ఎకనామిక్ రీజియన్, నీటి నిల్వల సామర్థ్యం పెంపు తదితర అంశాలపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు కలెక్టర్ సమాధానమిచ్చారు. గూగుల్ డేటా సెంటర్ ఆసియాలోనే అతి పెద్దదని, సుమారు 85 వేల కోట్లు పెట్టుబడి పెట్టనుందని, దీని రాకతో మన యువతకు అధిక సంఖ్యలో ఉద్యోగాలు రానున్నాయని పేర్కొన్నారు. విశాఖ వేదికగా భవిష్యత్తులో జరగనున్న మార్పులను, అవసరాలను దృష్టిలో పెట్టుకొని మౌలిక వసతులను భారీ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని, దానిలో భాగంగా 15 మాస్టర్ ప్లాన్ రోడ్లను వేస్తున్నామని చెప్పారు. 2026 ఏప్రిల్, మే నాటికి మాస్టర్ ప్లాన్ రోడ్లను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. 50 నిమిషాల్లో నగరం నుంచి భోగాపురం ఎయిర్ పోర్టుకు చేరుకునేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

గూగుల్‌తో పాటు వివిధ కంపెనీలు విశాఖకు వస్తున్నాయని, రెండు రోజుల క్రితం సిఫీ సంస్థ భూమి పూజ కూడా చేసుకుందని గుర్తు చేశారు. ఇటీవల రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి జిల్లాకు వచ్చిన సందర్భంలో విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి, ఐటీ పార్కుల ఏర్పాటుకు ల్యాండ్ బ్యాంకు గుర్తింపు తదితర అంశాల గురించి మాట్లాడారని విలేకరులు అడిగిన ప్రశ్నకు బదులిచ్చారు. జిల్లాలో 526 చెరువులు, నీటి కుంటలు ఉండగా.. వాటిలో 24 చెరువులను ఎస్.ఆర్.ఈ.జి.ఎస్. నిధులు, సీఎస్సార్ నిధులతో ఆధునికీకరిం చేందుకు ప్రణాళిక రూపొందించామని వివరించారు.

ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో స్కాలర్‌షిప్స్, జీఎస్టీపై అవగాహన

విశాలాంధ్ర - పెందుర్తి : పెందుర్తి ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో స్కాలర్‌షిప్స్, జిఎస్టీపై అవగాహన సదస్సు జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ ఈ ఫ్లోరా తెలియజేశారు. ఈ సదస్సుకు కళాశాల కరస్పాండెంట్ టీ.థియో ఫిలష్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా డిప్యూటీ డైరెక్టర్, సోషల్ వెల్ఫేర్ కే.రామారావు, శ్యామల పాల్గొన్నారు. ఈ అవగాహన సదస్సులో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న 170 మంది విద్యార్థులు పాల్గొని, విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ కోసం 6 స్టెప్ వెరిఫికేషన్, అర్హతలు, సమస్య పరిష్కారాలు, ఎస్సీ,ఎస్టీ, బిసీ విద్యార్థులకు హాస్టల్ వసతి మొదలగు విషయాలు గురించి వివరించారు. 75 శాతం హాజరు లేని విద్యార్థులకు ఉపకార వేతనాలు గవర్నమెంట్ ఇవ్వదని వారు వెల్లడించారు.సూపర్ జిఎస్టీ సేవింగ్స్ ద్వారా ప్రతి కుటుంబానికి 15 వేలు వరకు ఆదా అవుతుందని, వ్యాపారస్తులకు అమ్మకాలు పెరుగుతాయని, 99 శాతం వస్తువులు, సేవలు పన్ను రహితంగా ఉన్నాయని డిప్యూటీ డైరెక్టర్, సోషల్ వెల్ఫేర్ కే.రామారావు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ టి.థియోఫిలస్ మాటాడుతూ ప్రతి విద్యార్థికి 85 శాతం హాజరు ఉండాలని, ప్రతినెల 7 తారీకు లోపల ఆంధ్ర యూనివర్సిటీ కి, జ్ఞానభూమి సైట్లో హాజరు పంపిస్తున్నామని తెలిపారు. ఈ సదస్సులో ఆదర్శ్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ 3 యూనిట్లు పీఓలు మంజుల, ప్రదీప్, సంధ్యారాణి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రావు, ఏఓ రవిబాబు, సింహాచలం, కే. కరుణ, నాగరాజు తదితర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

బడ్డీలు తొలగింపుపై గంటాకి వినతి

విశాలాంధ్ర - భీమిలి: తగరపువలస జీవీఎంసీ రెండో వార్డు పరిధిలో ఈఎస్ఐ హాస్పిటల్ దగ్గర బడ్డీలు సమస్యపై స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివారావుకి సిఐటియు ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకి సిఐటియు నాయకులు ఆర్ఎస్ఎన్ మూర్తి, ఎస్.అప్పల నాయుడు, నేలతి రాము మాట్లాడుతూ గత 30 సంవత్సరాల నుండి ఈఎస్ఐ హాస్పిటల్, గోడకు ఆనుకొని సుమారు 50 కుటుంబాలు జీవిస్తున్నారన్నారు. ఆపరేషన్ లంగ్స్ పేరుతో జీవీఎంసీ వీరి షాపులన్నీ తొలగించారని వీరికి ఇంతవరక ఎటువంటి న్యాయం జరగలేదన్నారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ కమిషనర్‌తో మాట్లాడతామని చెప్పారు. కార్యక్రమంలో నర్సింగరావు, ప్రసాదు, కనకరాజు, రాము నాయుడు తదితర బాధితులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితులకు ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - భీమిలి: కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ సేవా కార్యక్రమాల్లో భాగంగా భీమిలి నివాసి, ఆటో డ్రైవర్ మార్గాన వీర వెంకట మోహనరావుకు రెండు కిడ్నీలు, పాడైపోవడం వల్ల, వైద్య ఖర్చుల నిమిత్తం కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్ ఆర్థికసాయం చేశారు. ఫౌండేషన్ కార్యాలయంలో ఆర్థిక సహాయంగా 10000/- రూ. కిడ్నీ బాధితునికి ఇవ్వడం జరిగింది.

ఫోన్, ప్రీమియం టీవీ, గృహోపకరణాలలో శాంసంగ్ రికార్డు అమ్మకాలు

విశాలాంధ్ర - విశాఖపట్నం: భారతదేశపు అతిపెద్ద కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ అయిన శాంసంగ్, సానుకూల వినియోగదారుల సెంటిమెంట్లు, ఆకర్షణీయమైన పండుగ డీల్స్, మరియు టెలివిజన్‌లు, ఎయిర్ కండిషనర్‌లపై జిఎస్‌టి రేట్ల తగ్గింపు కారణంగా పండుగ అమ్మకాలకు బలమైన ప్రారంభాన్ని పొందినట్లు ప్రకటించింది. శాంసంగ్ తన గెలాక్సీ ఏఐ ఆధారిత జెడ్ ఫోల్డ్7 ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్, గెలాక్సీ ఎస్ 25 సిరీస్ గెలాక్సీ ఎస్ 24 సిరీస్ పోర్ట్‌ఫోలియో నేతృత్వంలో, నవరాత్రి మరియు దసరా పండుగ కాలంలో తన ప్రీమియం స్మార్ట్‌ఫోన్‌ల అమ్మకాలు రికార్డు స్థాయికి చేరుకున్నాయని తెలిపింది. గెలాక్సీ ఏఐ అనేది శాంసంగ్ యొక్క అత్యాధునిక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇది వినియోగదారులు శాంసంగ్ స్మార్ట్‌ఫోన్‌లతో మరింత సహజంగా, సమర్థవంతంగా మరియు వ్యక్తిగతీకరించిన రీతిలో సంభాషించడానికి రూపొందించబడింది. రూ. 30,000 కంటే ఎక్కువ ధర కలిగిన ప్రీమియం గెలాక్సీ స్మార్ట్‌ఫోన్‌ల అమ్మకాలు, గత సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే 1.4 రెట్లు పెరిగాయి. శుభప్రదమైన దీపావళి పండుగ సమీపిస్తున్న తరుణంలో కూడా తమ ప్రీమియం ఏఐ స్మార్ట్‌ఫోన్‌లు మంచి పనితీరును కనబరుస్తాయని శాంసంగ్ విశ్వసిస్తోంది" అని శాంసంగ్ ఇండియా ప్రతినిధి తెలిపారు.

అస్మిత వుమెన్ రగ్బీ లీగ్ పోటీలు

విశాలాంధ్ర - భీమిలి: కేంద్ర ప్రభుత్వం మహిళలను ప్రోత్సహించే దిశగా అస్మిత పేరుతో దేశంలోని పలు ప్రాంతాల్లో అస్మిత రగ్బీ లీగ్ పోటీలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా భీమిలి వైజాగ్‌లో ఉమెన్ క్యాటగిరిలో ఈ ప్రాంత వాసులకు పోటీలను నిర్వహించి ప్రోత్సహించేందుకు భీమిలికి కేటాయించారు. విజేతలకు ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులతో పాటు అందరికీ పార్టిసి పేషను సర్టిఫికెట్లు అందజేయబడ తాయి. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఉమెన్ క్రీడాకారులను ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపిక కాబడుతారు. రఘు గేమ్ ఒలింపిక్స్ లోను, ఏషియన్ గేమ్స్‌లోను నేషనల్ గేమ్స్‌లోను, స్కూల్ గేమ్స్‌లోను ,యూనివర్సిటీ గేమ్స్‌లోను రెగ్యులర్‌గా జరుగుతున్నాయి. అదేవిధంగా మన రాష్ట్రంలో ప్రతి సంవత్సరం మినీ సబ్ జూనియర్, సబ్ జూనియర్, జూనియర్ సీనియర్ కేటగిరీలో క్రమం తప్పకుండా రాష్ట్రస్థాయి పోటీలు జరుగుతున్నాయి.

లాయర్లకు ఇచ్చిన మాట నిలబెట్టుకోని కూటమి

- జిల్లా వైసీపీ అధ్యక్షులు కేకే రాజు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: కూటమి అధికారంలోకి వస్తే లాయర్లకు పదివేల రూపాయలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత మాట నిలబెట్టుకోలేదని జిల్లా వైసీపీ అధ్యక్షులు కేకే రాజు అన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, లాయర్లకు ఇచ్చిన హామీని గురించి వైయస్సార్సీపి లీగల్ సెల్ రాష్ట్ర కమిటీ, జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం పౌర గ్రంథాలయంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో కేకే రాజు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జగన్మోహన్ రెడ్డి జగనన్న లానేస్తం పేరున లాయర్లకు 5000 రూపాయలు అందజేశారని గుర్తు చేశారు. కూటమి పార్టీలు అధికారంలోకి వస్తే పదివేల రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చి లాయర్లను విస్మరించారని ధ్వజమెత్తారు. పేద విద్యార్థులకు వైద్య విద్యను అందించాలని గొప్ప ఆశయంతో జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాల నిర్మాణాలను ప్రారంభిస్తే.. కూటమి ప్రభుత్వం రాజకీయ కక్షతో ప్రైవేటీకరణకు పూనుకుందని ధ్వజమెత్తారు. చంద్రబాబు బినామీలను ఆర్థికంగా బలోపేతం చేయడం కోసం వారికి ఈ మెడికల్ కాలేజీలను కట్టబెట్టడం కోసమే వైద్య కళాశాలలను ప్రవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. దుబాయ్, మలేషియాల్లో లోన్లు తీసుకొని ఒక్కోటిగా క్లోజ్ చేస్తున్న ఒక డిఫాల్ట్ కంపెనీ అయిన లు లు కంపెనీకి కారు చవకగా భూములు దోచిపెడుతుందని విమర్శించారు. ఉత్తరాంధ్ర ప్రాంతానికి కొంత అభివృద్ధి, మంచి జరిగింది అంటే అది కేవలం వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో మాత్రమేనని పేర్కొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గంటా శంకుస్థాపన

విశాలాంధ్ర - భీమిలి: జీవీఎంసీ 3వ వార్డులో రూ.81 లక్షలతో ప్రతిపాదించిన వివిధ అభివృద్ధి పనులకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మంగళవారం శంకుస్థాపన చేశారు. నియోజకవర్గంలోని జీవీఎంసీ వార్డుల్లో రూ.100 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. భీమిలిలోని ప్రధాన రోడ్ల విస్తరణ పనులను తొందర్లోనే ప్రారంభించడానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. వార్డులో ప్రతిపాదించిన రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన కింద 10 ఔట్ బోట్ మోటార్స్ ను లబ్ధిదారులకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గాడు చిన్ని కుమారి లక్ష్మి, పి.వి. నరసింహం, లొడగల అప్పారావు, జెడ్పీటీసీ గాడు వెంకటప్పుడు, రాష్ట్ర పార్టీ కార్యదర్శి గంటా నూకరాజు, కూటమి నాయకులు గాడు అప్పలనాయుడు, గొలగాని నరేంద్ర, శాఖరి శ్రీనివాస్, కోరాడ రమణ, తాట్రాజు అప్పారావు, సరగడ అప్పారావు, బి.ఆర్.బి. నాయుడు, కర్రి శ్రీనివాసరావు, దండి వెంకటేష్, పాసి త్రినాథ్ కుమార్, గరికిన కింగ్, మొల్లి లక్ష్మణరావు వాండ్రాసి అప్పలరాజు, గరే గురునాథ్, రెడ్డి సత్యం, బమ్మిడి తారక్ తదితరులు పాల్గొన్నారు.

రగ్బీ పోటీలను ప్రారంభించిన గంటా

ఎన్టీఆర్ భీమిలి ఫుట్ బాల్ స్టేడియంలో ఖేలో ఇండియా అస్మిత రగ్బీ లీగ్ పోటీలను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు. ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.హర్ష వర్ధన్ ప్రసాద్, రాష్ట్ర రగ్బీ అసోసియేషన్ కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా శాఖ అధ్యక్షుడు లలిత్ కుమార్, కార్యదర్శి కిషోర్, ఉపాధ్యక్షుడు నల్ల శ్రీనివాస్, మురళి తదితరులు పాల్గొన్నారు.

అరకు ఇన్‌స్టంట్ కాఫీని విడుదల చేసిన ఆర్గానిక్ ఇండియా

విశాలాంధ్ర - విశాఖపట్నం: టాటా ఉత్పత్తి అయిన ఆర్గానిక్ ఇండియా, ఇటీవల అరకు ఇన్‌స్టంట్ కాఫీని విడుదల చేసింది. ప్రీమియం 100 శాతం అరబికా కాఫీతో తయారు చేయబడిన సర్టిఫైడ్ ఆర్గానిక్ కాఫీ మిశ్రమం ఇది. అత్యంత సహజమైన అరకు వ్యాలీ భూముల నుండి తీసుకోబడిన ఈ ఉత్పత్తి నైతికంగా సాగు చేసిన సేంద్రీయ పదార్థాల వేడుక. పర్యావరణం మరియు స్థానిక సమాజాల సాధికారత పట్ల బ్రాండ్ యొక్క అచంచలమైన నిబద్ధతకు ఈ ఆవిష్కరణ ఒక నిదర్శనం. నిబద్ధతతో రూపొందించబడిన ఈ ఇన్‌స్టంట్ కాఫీ కేవలం పానీయం కంటే ఎక్కువ ఇది ప్రతి కప్పులో కలిపిన స్వచ్ఛత, స్థిరత్వం మరియు సంస్కృతి యొక్క మిశ్రమం. ఆర్గానిక్ ఇండియా అరకు కాఫీ 100 శాతం ప్రీమియం అరబికా బీన్స్‌తో తయారు చేయబడింది. ఇది రుచికరమైన ఫ్రూటీ మరియు చాక్లెట్ నోట్‌తో గొప్ప మరియు మృదువైన సువాసనను అందిస్తుంది. అరకు లోయలో ఎత్తైన ప్రాంతాలు అంటే సుమారు 3000 అడుగుల ఎత్తులో పెరిగిన ఈ ఉత్పత్తి దాని విభిన్న మూలం నుండి దాని ప్రత్యేక గుర్తింపును పొందింది. ఈ ప్రాంతం యొక్క సారవంతమైన నేల, చల్లని వాతావరణం మరియు సేంద్రీయ వ్యవసాయ పద్ధతులు ప్రకృతి మరియు కాఫీ రెండింటినీ ఆరాధించే వారికి దీనిని ఒక ప్రత్యేకమైన ఎంపికగా చేస్తాయి. అరకు లోయ నుండి కాఫీని సేకరించడం ద్వారా, బ్రాండ్ ఉత్పత్తిని పెంచుతోంది, ఇది స్థానిక గిరిజన రైతులకు వారి గొప్ప వ్యవసాయ వారసత్వాన్ని ప్రోత్సహించడమే కాకుండా సంరక్షించడం ద్వారా ప్రయోజనం చేకూరుస్తుందని టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్, ప్యాకేజ్డ్ బేవరేజెస్, ఇండియా అధ్యక్షుడు పునీత్ దాస్ తెలిపారు.

హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌కు మినీ రత్న హోదా

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ ప్రతిష్టాత్మకమైన మినీ రత్న హోదాను పొందడం ద్వారా ఒక చారిత్రాత్మక మైలురాయిని సాధించింది. ఈ గుర్తింపు హెచ్ఎస్ఎల్ యొక్క ఆర్థిక పునరుజ్జీవనం, కార్యాచరణ నైపుణ్యం మరియు భారతదేశం యొక్క సముద్ర, రక్షణ రంగాలకు పెరుగుతున్న సహకారంలో ఒక నిర్ణీత ఘట్టాన్ని సూచిస్తుంది. హెచ్ఎస్ఎల్ సీఎండీ గిరిదీప్ సింగ్ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. హెచ్ఎస్ఎల్‌లో ఇది అందరికీ గర్వకారణమని, మినీ రత్న హోదా సాధించడం మా శ్రామిక శక్తి యొక్క అంకితభావం నిబద్ధతను ప్రతిబింబిస్తుందన్నారు. వారి మద్దతు, నమ్మకం మరియు సహకారం కోసం రక్షణ మంత్రిత్వ శాఖ, మా కస్టమర్‌లు వ్యాపార భాగస్వాములకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. వ్యూహాత్మక సహకారాలు, అధునాతన నౌకానిర్మాణ సాంకేతికతల ఏకీకరణ దాని భవిష్యత్తు ప్రయాణాన్ని నిర్వచిస్తుందన్నారు.



ఎయిర్‌పోర్టు పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలి

కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: విశాఖ ఎయిర్‌పోర్టు పరిసర ప్రాంతాల్లో ఎటువంటి అపరిశుభ్రత చోటుచేసుకోకుండా పరిశుభ్రంగా ఉండేటట్టు చూడాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. డ్రెయిన్ల ద్వారా మురుగు, వర్షపు నీరు సాఫీగా పోయేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఎయిర్పోర్ట్ పర్యావరణ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పోర్టు ట్రక్ పార్కింగ్ ప్రాంతంలో లారీ డ్రైవర్లు ఆహార పదార్థాలను ఎయిర్‌పోర్టు గోడ సమీపంలో పారేయకుండా చర్యలు తీసుకోవాలని, దాంతో పక్షులు చేరి విమాన రాకపోకలకు ప్రమాదం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. మేఘాద్రిగెడ్డ, ఇతర గెడ్డ ప్రాంతాల్లో పూడికపోయిన చెత్తను క్రమం తప్పకుండా తొలగించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఎయిర్‌పోర్టు పరిసరాల్లో నిర్మాణ సామగ్రి, చెత్తా చెదారం డంపింగ్ చేయకుండా పర్యవేక్షణ చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో ఎయిర్‌పోర్టు అథారిటీ, విశాఖపట్నం పోర్టు, ఐఎన్ఎస్ డేగా, జీవీఎంసీ, ఇరిగేషన్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుపై హర్షం

విశాలాంధ్ర - మల్కాపురం: చంద్రబాబు నాయుడు, లోకేష్ ఆలోచనలతో విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుపై మంగళవారం ఢిల్లీలో ఒప్పందం కుదరడంపై పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ గణబాబు ఆదేశాలతో విశాఖ పారిశ్రామిక ప్రాంతం పరిధిలోని 61వ వార్డులో బాణాసంచ కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు అర్బన్ జిల్లా సెక్రటరీ, క్లస్టర్ కాకి పోలిరెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు హెల్త్ ఇన్సూరెన్స్ నిధులు మంజూరు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జిల్లా నుండి 2022-24 అక్రిడేషన్ కార్డులు పొందిన జర్నలిస్టులకు సంబంధించి హెల్త్ కార్డుల రెన్యువల్ కొరకు వ్యక్తిగతంగా చెల్లించవలసిన హెల్త్ ఇన్సూరెన్స్ రూ.1250/-లను చెల్లించుటకు జిల్లా కలెక్టర్ నిధులు మంజూరు చేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు హెల్త్ ఇన్సూరెన్స్ కార్డులు రెన్యువల్ చేసేందుకు గాను పత్రాలను జిల్లా సమాచార పౌర, సంబంధాల కార్యాలయంలో అందజేయాలని కలెక్టర్ తెలిపారు. 2022-24 అక్రిడిటేషన్ జిరాక్స్, ప్రస్తుతం సెప్టెంబర్ నుండి నవంబర్ 2025 వరకు రెన్యూవల్ స్లిప్, హెల్త్ కార్డ్ జెరాక్స్, ఆధార్ కార్డ్ జెరాక్స్ అందజేయాల్సి ఉంటుందన్నారు.

గీతం ఆర్కిటెక్చర్ ఎన్.ఎస్.ఎస్. విద్యార్థుల స్వచ్ఛభారత్

విశాలాంధ్ర - మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ జాతీయ సేవా పథకం (ఎన్.ఎస్.ఎస్.ఎస్) వాలంటీర్ల ఆధ్వర్యంలో భీమిలిలోని ప్రాచీన కట్టడాల పరిసరాలలో మంగళవారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పురాతన కట్టడాల పరిరక్షణతోపాటు సందర్శకుల కోసం వాటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన ఆవశ్యకతను గీతం ఆర్కిటెక్చర్ డీన్ విభూతి స్వచ్ఛ దేవ్ స్థానికులకు వివరించారు. సుస్థిర అభివృద్ధి ప్రజలు అందరూ భాగస్వామ్యులుగా ఉండాలన్నారు. భీమిలిలోని ప్రాచీన కట్టడాల ప్రాచుర్యానికి, పరిరక్షణకు, పరిశుభ్రమైన వాతావరణానికి గీతం ఆర్కిటెక్చర్ విభాగం కృషి చేస్తుందని తెలిపారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రాచీన కట్టడాల పరిసరాల్లో మొక్కలు నాటారు. ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రామ్ ఆఫీసర్ మత్రి జ్యోతి ఆధ్వర్యంలో 30 మంది వాలంటీర్లు కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక మత్స్యకార నాయకులు కర్రి చిన్నారావు, గంటా నూకరాజు, సాగర వికాస సంఘం సి.ఇ.ఓ. శ్రీనివాస కుమార్ తదితరులు పాల్గొని గీతం విద్యార్థులను అభినందించారు.

పిజిఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారానికే మొదటి ప్రాధాన్యత

ల్యాండ్ పూలింగ్ విషయంలో దళారులను నమ్మవద్దు

తహశీల్దార్ కాకర ఆనందరావు



విశాలాంధ్ర - పద్మనాభం: పిజిఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారానికే మొదటి ప్రాధాన్యత ఇస్తామని, ల్యాండ్ పూలింగ్ విషయంలో దళారులను నమ్మవద్దు అని తహశీల్దార్ కాకర ఆనందరావు అన్నారు. పద్మనాభం తహసిల్దార్‌గా బాధ్యతలు చేపట్టి ఒక సంవత్సరం పూర్తయిన సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ రెవెన్యూ శాఖ దృష్టి పెట్టిన వాటిల్లో మొదటి ప్రాధాన్యత పిజిఆర్ఎస్‌కే అని అన్నారు. 2025 జనవరి 1 నుంచి ఇప్పటివరకు సుమారు 952 పిజిఆర్ఎస్ లో ఫిర్యాదులు వచ్చాయని వాటిలో 872 ఫిర్యాదులను పరిష్కరించామని 79 ఫిర్యాదులు పెండింగ్లో ఉన్నాయని తెలియజేశారు. మండలంలోని 25 గ్రామాలు ఉండగా గత ఏడాది 17 గ్రామాలకు రీసర్వే పూర్తయిందని ప్రస్తుతం గంధవరం పూర్తయిందని, కొవ్వాడ పంచాయతీలో గ్రౌండ్ లెవెల్ రీ సర్వే పూర్తయిందని అన్నారు. పాండ్రంగి,పొట్నూరు,రెడ్డిపల్లి గ్రామాలలో రీ సర్వే మొదలుపెట్టి ఉన్నామని తెలియజేశారు. అన్ సెటిల్ పంచాయతీలలో సెటిల్ అవ్వగానే రి సర్వే ప్రారంభిస్తామని తెలియజేశారు. మండలంలోని చాలావరకు ప్రైవేట్ భూములు క్రయవిక్రయాలు జరిగినప్పటికీ రిజిస్ట్రేషన్లు కొన్ని భూములకు జరగకపోవడం వల్ల అటువంటి భూములకు ఫిర్యాదులు ఎక్కువ వస్తున్నాయని అలాంటి భూములకు రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లయితే ఆ భూ సమస్యలను పరిష్కరిస్తామని తెలియజేశారు. ప్రస్తుత పెండింగ్లో ఉన్న పిజిఆర్ఎస్ ఫిర్యాదులలో ఎక్కువ ఇటువంటి భూ సమస్యలేనని అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో ల్యాండ్ పూలింగ్ మరియు ల్యాండ్ బ్యాంకింగ్ మొదలుపెట్టి యున్నామని అన్నారు. కృష్ణాపురంలో ఎం ఎస్ ఎం ఈ పార్క్ కొరకు సుమారు 65 ఎకరాలు సేకరించినట్లు తెలియజేశారు. కొవ్వాడలో ల్యాండ్ పూలింగ్ వి ఎం ఆర్ డి టౌన్షిప్ కొరకు 250 ఎకరాలను సేకరించడానికి సర్వే నెంబర్ 237లో ఈ భూ సేకరణ మొదలుపెట్టగా అందులో రస్తాలు గడ్డలు కొండవాలు ప్రాంతాలు అన్ని తీసేగా సుమారు రైతులు అనుభవంలో ఉన్న ల్యాండ్ 150 ఎకరాలుగా గుర్తించామని ఈ 150 ఎకరాలకు గాను 253 మంది రైతులను ప్రాథమిక దశలో గుర్తించామని తెలియజేశారు. ఆ సర్వే నెంబర్ లో ఉన్న రైతులు కొవ్వాడ మరియు కాటిక పల్లి గ్రామానికి చెందిన రైతులుగా గుర్తించి వారికి పలుమార్లు గ్రామ సభలు పెట్టి అవగాహన కల్పించామని అన్నారు. గుర్తించిన రైతులు వివరాలను గతంలో తెలియపరచడం జరిగిందని, అభ్యంతరాలు ఉన్న రైతులు తమ దగ్గర ఉన్న ఆధారాలతో మాకు తెలియజేయాలని కోరారు. అభ్యంతరాలను, ఇతర సమస్యలను పరిష్కారానికి ఆర్డిఓ ఆధ్వర్యంలో రెండు నెలల సమయం కేటాయించగా నవంబర్ 25 తర్వాత ఆ గ్రామాల రైతులతో గ్రామసభ ఏర్పాటు చేసి ఆర్డీవో సమక్షంలో ల్యాండ్ పూలింగ్ పూర్తి చేయడం జరుగుతుందని తెలియజేశారు. ఇప్పటివరకు కొవ్వాడ గ్రామం నుంచి 28 అభ్యంతరాలను సేకరించినట్లు తెలియజేశారు. ఈ ల్యాండ్ పూలింగ్ విషయంలో దళారులను మధ్యవర్తులను నమ్మి అమాయకమైన రైతులు బలి కావద్దని నిజమైన రైతులు మోసపోవద్దని అర్హులైన ప్రతి రైతుకు న్యాయం జరుగుతుందని తెలియజేశారు. పద్మనాభం మండలం చెన్నై కారిడార్ కు ఎకనామికల్ కారిడార్కు సుమారు రెండు గంటల ప్రయాణ దూరములో అందుబాటులో ఉండటంవల్ల అభివృద్ధి వేగం పుంజుకుంటుందని తెలియజేశారు. రీ సర్వేలకు నోడల్ అధికారిగా రీ సర్వే డిప్యూటీ తహసిల్దార్ ఆధ్వర్యంలోని జరుగుతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ తో పాటు ఆర్ఎస్డిటి శ్రీనివాసరావు హెచ్ డి టి చంద్రశేఖర్ పాల్గొన్నారు.